


వేములపల్లి మోహనరావు

'గుడ్ మార్నింగ్. ఇంటర్నేషనల్ బుకింగ్.'

లక్షమంది కోరస్ పాడుతున్నా, విలక్షణమైన ఆ గొంతును చిటికెలో పసిగట్టెయ్యగలను నేను.

'సీతా, నువ్వేనా డ్యూటీలో. థాంక్ గాడ్ !'

'ఓ! చక్రవర్తి సాబ్. ఎక్కణ్ణుంచీ, ఎప్పుడొచ్చారు. ఎలా ఉన్నారు. ఏమై పోయారు ఇన్నాళ్ళూ ! క్షేమమేనా ! ఏమిటి విశేషాలు. మేడమ్ కూడా ఉన్నారా మీతో.'

'ఏమిటీ ప్రశ్నల వర్షం ! ముందు లండన్‌కో కాల్ బుక్ చెయ్యి.'

'అవన్నీ తర్వాత. ముందు మీ రీ

సంగతి చెప్పండి. ఇన్నాళ్ళూ ఏమై పోయారు.'

'చిన్న కుర్రవాణ్ణి గదూ! అందుకని ప్రపంచంలో దారి తప్పిపోయాను. సరేనా.'

'మీ రెప్పుడు సరైన సమాధానం ఇచ్చారు గనక ! ఇంతకీ ఎక్కణ్ణుంచి !'

'షెరటన్‌లో ఉన్నాను. తొందరగా కాల్ ఇవ్వు. అర్జంట్.'

'మీకు అర్జంట్ కాని దెప్పుడు! అది సరే. మీతో పర్సనల్‌గా మాట్లాడాలి. ఇది ఎమర్జంట్.'

'రేపు పదిన్నరకు హోటల్లోనే ఉంటాను. సాయంత్రంవరకూ పనిలేదు.'

'ఓకే అయితే, పదిన్నరకు వస్తాను. మీరు లైన్ క్లోజ్ చెయ్యండి. పది నిమిషాల్లో పిలుస్తాను.'

ఆ అమ్మాయికీ నాకూ ఉన్న సంబంధం ఈనాటిది కాదు. దాదాపు రెండున్నర సంవత్సరాలుగా టెలిఫోన్ తీగలు మమ్మల్నిద్దర్నీ కలుపుతూనే ఉన్నాయి తను చేసే ఉద్యోగానికి సహనం ఎంత అవసరమో, నేను చేసే వ్యాపారానికి అసహనం అంత సహజం. ఒకో కాల్ వేల డాలర్లతో సమానం నాకు. ఆ సంగతి ఆ అమ్మాయికి తెలుసు. నాకు త్వరగా లైన్ ఇవ్వటానికి అప్పుడప్పుడు పెద్ద రిస్కు తీసుకుంటుంది తను. ఆ సంగతి నాకు తెలుసు.

ఒకసారి ఆ అమ్మాయి నాకో ఇన్ కమింగ్ కాల్ కనెక్ట్ చెయ్యవలసి వచ్చింది మొదట బాంబే, తర్వాత ఢిల్లీ, మద్రాస్, ఇండియాలో నేనుంటాను అనుకున్న ప్రతిచోటికీ ట్రై చేసింది. ఆఖరికి హైద్రాబాద్‌లో దొరికాను నేను. విరుచుకుపడిపోయింది నా మీద.

'ఏమిటసలు మీ ఉద్దేశ్యం ! ఒక రోజు తాజ్‌లో కాసేపాగి ఢిల్లీ ఇంటర్ కాంటినెంటల్‌లో, మర్నాడు మద్రాస్ కోరమండల్‌లో, ఎన్నిచోట్లని వెదక మంటారు. అరగంటనుండీ బిజీగా ఉంచాను లైన్ మీకోసం. అవతల మీ పార్టీ కాల్ కాన్సిల్ చేసుకోనంటాడు...

'టేకిట్ ఈజీ బేబీ' ఏం చెయ్యను చెప్పు. అన్నిరోజులూ నీతోపాటు బాంబేలోనే కూర్చోవాలంటే ఇదేమన్నా బిజినెస్సా ! మజాకా ! అయినా నువ్వు నాకోసం దేశమంతా రెక్కలు గట్టుకుని ఎగరక్కర్లేదు గదా ! నాలుగు నంబర్లు గిర్రున తిప్పడానికి ఇంత హైరానపడిపోతావేం ?'

'నాలుగొందలసార్లు తిప్పాను నంబర్లు మీ స్వాంతన వాక్యాలు మీ ఆవిడకు చెప్పండి శాంతిస్తారు. నాక్కాదు చెప్ప వలసింది.'

'పోనీ నన్ను పెళ్ళిచేసుకోరాదూ. ఎప్పుడు ఎక్కడుంటానో ప్రతి నిమిషం నీకు తెలుస్తూనే వుంటుంది. ఇంత కష్ట పడనక్కర్లేకుండా. అయినా, ఇద్దరు పిల్లలూ, యాభైఏళ్ళ వయసూగల, నా కన్నా అర్హతగల వరుడు నీ కెక్కడ దొరుకుతాడు ?'

నవ్వు ఆపుకోలేకపోయిందామె.

'బాబూ మీకూ మీపెళ్ళికీ ఓ దండం. రోజుకు మూడు విమానాలు మారే మొగుడు నాకొద్దు. మాట్లాడండి మీ పార్టీతో.'

ఇంకోరోజు.

'నీ పేరేమిటమ్మాయ్ ?' మెల్లగా అడిగాను.

'మీ కనవసరం అబ్బాయ్.'

'వెల్ ! నా కనవసరమైన విషయం ఈ ప్రపంచంలో లేదు. కావాలనుకున్న తర్వాత తెలుసుకోకుండా ఊరుకునేదీ లేదు.'

'కాని మా ఆపరేటర్లు పేరు చెప్పగూడదు.'

'అది నిజమేననుకో సీతా. కానీ మీలో ఎంతమంది దాన్ని రహస్యంగా ఉంచగలరంటావ్ !'

'మైగాడ్! నా పేరు మీకెలాతెలుసు?'

నీమీద ఆసక్తి ఉన్నవాణ్ణెవణ్ణీ అటువంటి అర్థరహితమైన ప్రశ్న అడక్కు. బెర్న్‌కు ఓ కాల్ బుక్ చేసుకో.' నంబర్ ఇచ్చి ఫోన్ పెట్టేశాను.

అలాఅలా పెరిగింది మా పరిచయం.

ఓబ్రాయి షెరటన్లో సాధారణంగా నన్నెవ్వరూ పదిన్నర వరకూ నిద్రలేపే సాహసం చెయ్యలేరు. ఆ రోజు అందుకు విరుద్ధంగా పదింటికే ఫోన్ మోగింది. విసుగ్గా రిసీవర్ అందుకున్నాను. నా సెక్రటరీ ఉన్నాడు అవతలివైపు.

'బాస్' "ఎస్ విజయ్"

"ఫ్రాంక్‌ఫర్ట్ పార్టీ మీకోసం ఎదురుచూస్తున్నారు. వాళ్ళకు ఫ్లైట్ టైమైపోతోంది. వాళ్ళకు పదింటికి ఎపాయింట్‌మెంట్ ఇచ్చాం నిన్న. కింద లాబీలో కూర్చున్నారు మీకోసం. రూంకు తీసుకురానా, మీరే కిందకు వస్తారా !"

అప్పటివరకూ వాళ్ళ సంగతి నాకు గుర్తే రాలేదు. ఈ మధ్య మతిమరుపు బాగా ఎక్కువై పోతోంది. మొన్న ఓసారి ప్రేమగా మా ఆవిడ నడుం చుట్టూ చెయ్యివేసి 'వడ్డించవోయ్ వచ్చేస్తున్నా' అంటే 'విడాకులిచ్చేయ్' అని నేనడిగినంత విచిత్రంగా చూసింది. విశేషమేమిటంటే అంతకు అరగంట ముందే నేను భోంచేశానట.

'ఓకే విజయ్. నేను వస్తున్నాను. సారీ ఫర్ ది డిలే. ఈలోపల నువ్వు వాళ్ళ ప్రపోజల్స్ ఏమిటో, మనం వాళ్ళతో ఎంతవరకు ముందుకు వెళ్ళ వచ్చో చూడు. స్నానంచేసి బయల్దేర తాను.

నేను రూం లాక్‌చేయబోతుండగా వచ్చింది సీత. అప్పటివరకూ నా కామె

ఎలా ఉంటుందో తెలీదు. చూసిన తర్వాత సృష్టికర్త అభిరుచిని అభినందించకుండా ఉండలేకపోయాను.

'చూశారా! టైమంటే టైమే. పదిన్నర అన్నాను. వచ్చేశాను సరిగ్గా.'

'ఉద్ధరించావ్‌లే. కాల్స్ కనెక్ట్ చెయ్యడానికి రాని ఉషారు అపాయింట్ మెంట్లకు అటెండ్ అవడానికి వస్తుంది. రా లోపలికి. అవిగో మాగజైన్స్. డ్రింక్స్ కావాలంటే ఫ్రిజ్‌లో వున్నాయి. ఫోనెత్తితే నీక్కావల్సింది కాళ్ళదగ్గర కొస్తుంది. అయిస్‌క్రీం మాత్రం అడక్కు. అనవసరంగా లావెక్కిపోయి చూసేవాళ్ళ గుండెల్ని స్పందింపజేసే నీ అందాన్ని చేజేతులా పోగొట్టుకున్నదాని వౌతావు. నే నిప్పుడే పది నిమిషాల్లో వచ్చేస్తాను, ఓకే."

ఆమె సమాధానం కోసం ఆగలేదు నేను. ఆ లేతమొహంలో లీలగా మెదిలిన నిస్పృహను గమనించనట్లే లిఫ్ట్‌వైపు నడిచాను. అనేక విషయాలకన్నా నాకు కాలం చాలా ముఖ్యమైనది మరి.

ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళి వాళ్ళను పంపించివస్తూ టైం చూసుకున్నాను. బాప్‌రే! పన్నెండూ నలభై. ఏమయిందో పాపం ఈ అమ్మాయి. రూంలోకి అడుగుపెట్టేసరికి నేననుకున్నట్టే...

ఎంతోసేపు ఏడ్చి అలిసిపోయిన పాపాయిలా మంచానికి అడ్డంగా పడుకుందామె. దిండుమీద కన్నీటి చారికలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఎన్నాళ్ళుగానో సమాధిచేయబడ్డ సున్నితమైన భావాలెన్నో ఒక్కసారిగా ఉప్పొంగాయి. ఎప్పుడో మర్చిపోయిన ఆత్మీయత, అనుబంధాలు మళ్ళీ ఈరోజు తిరుగుబాటు చేస్తుంటే ఆమె తల నిమరడానికి వెళ్ళబోయిన నా చెయ్యి ఆగిపోయింది. మనిషికి నిద్రను మించిన సుఖం ఏముంది! తాత్కాలికంగా స్వర్గంలో విహరించే ఆ అంధమైన పసిపిల్లను మళ్ళీ ఈ సమస్యల కీకారణ్యంలోకి బలవంతాన తీసుకు రావడం ఎందుకు!




ఆ ముప్పయ్యో అంతస్తులో నిలబడి కాళ్ళకిందకు కదిలివచ్చేస్తున్నట్టున్న సముద్రాన్ని తదేకంగా చూడటం నా అలవాట్లలో ఒకటి. కానీ ఈరోజు ఈ అమ్మాయి నా దృష్టిని పదే పదే తనవైపు ఆకట్టుకుంటోంది. నిజానికి ఆడదానికీ, అగాధమైన జలనిధికీ ఏముంది గనక!

ఏ సుఖమైనా ఎక్కువకాలం నిలవనట్టే, ఆ అమ్మాయి నిద్రకూడా నిలవలేదు.

'ఎంతసేపయింది మీరొచ్చి; నన్ను లేపలేదేం' అంది కళ్ళు తుడుచుకుంటూ.

"ఇప్పుడేలే. వెళ్ళి మొహం కడుక్కురా. భోంచేసి వద్దాం" అన్నాను.

మొగల్ రూం గమ్మత్తుగా మత్తుగా వెలుగుతోంది. బఫే టేబుల్ మీద రకరకాలపదార్థాల క్రింద నీలి నీలి మంటలు సన్నగా శబ్దం చేస్తున్నాయి. ఏవేవో నాలుగు రకాలు వేసి ప్లేట్ ఆమె కందించాను. యాంత్రికంగా అందుకుందామె. మా యిద్దరిలో ఏ ఒక్కరికీ భోంచెయ్యాలని లేదు. ఏదో తిన్నామనిపించి, బయటికి వచ్చాం. లిఫ్ట్‌లోకూడా తనేమీ మాట్లాడలేదు. నేను అద్దంలో కనిపిస్తున్న నా వార్థక్యపు చిహ్నాల్ని చూసి కాసేపు విచారించాను అలవాటుగా.

సిగరెట్ వెలిగించి విశ్రాంతిగా నడుం వాల్చాను. సముద్రం, ఆకాశం కలిసి గీస్తున్న సరళరేఖ మీద నిలిచిన ఆమె చూపు ఎంతోసేపటిగ్గానీ నా మీదకు మరలలేదు. గదిలో సన్నగా వ్యాపిస్తున్న సంగీత స్రవంతికి ఆనకట్ట వేసి ఆమెవైపు చూశాను. కానీ ఆమెలో ఏం మార్పు రాలేదు. గదిలో గూడు కట్టుకుపోతున్న నిశ్శబ్దం వయసును ఐదు నిమిషాలకు మించి పెంచదల్చుకోలేదు నేను.

"టెల్ మీ బేబీ. ఎందుకలా ఉన్నావ్.?"

పదాలు వెదుక్కుంటున్నట్టుందామె. గొంతు సవరించుకుంది. ఎలా మొదలు పెట్టాలో తెలియనట్టు చేతివేళ్ళు చూసుకుంది ఓసారి. తడిసిపోతున్న కళ్ళను బలవంతాన పొడిగా చేసుకోవడానికి విఫల ప్రయత్నం చేస్తోంది. ఆమెను వెక్కిరిస్తున్నట్టు ఫోన్ మోగింది.

'మనం నాలుగింటికి దాదర్‌లో

ఉండాలి బాస్. నీరద్ చౌధురీతో అయిరన్ ఓర్ డీల్ గురించి ఈ రోజే డిస్కషన్స్. ఓ అరగంటలో బయల్దేరదాం. రెడీగా ఉండండి.'

నాకు నిజానికి ఆ నిమిషంలో ఈ ప్రపంచం మొత్తాన్ని వదిలిపెట్టి పారిపోవాలనిపిస్తోంది. ఆడపిల్ల కన్నీటికి నాకూ ఏమాత్రం పడదు. నేనున్నచోట స్త్రీ కంట తడిపెడితే అది నాకు చిత్రహింస. ఈ మనస్తత్వం నాకు ఊహ తెలిసినప్పటికే నాలో పాతుకుపోయిందనుకుంటాను.

'ఓ. వెల్. ఆ అపాయింట్మెంట్ కాన్సిల్ చెయ్యి విజయ్, లేదూ మేనేజ్ చెయ్యగలననుకుంటే నువ్వొక్కడివే వెళ్ళిరా,'

'అదేమిటి. ఈ మీటింగ్ కోసం మొన్నటి నుండీ ఎన్నో ప్లాన్ చేసుకున్నాం. అదీగాక ప్రైస్ విషయాలు మీరు ఫైనలైజ్ చెయ్యాలిగానీ నేనేం చెయ్యగలను.'

'కానీ ఇక్కడ నేను అంతకన్నా ముఖ్యమైన పనిలో ఉన్నాను.'

అతనేం మాట్లాడలేదు. కానీ ఆ మౌనంలోని ఆశ్చర్యం నా కర్థమౌతూనే ఉంది. తనకు తెలియని పనులు నాకేమీ లేవు. అధికారిని ప్రశ్నించలేని అశక్తత అతన్ని పట్టి పీడిస్తోందని తెలుస్తూనేఉంది. అతన్ని ఆ స్థితిలో ఎక్కువసేపు ఉంచడం ఇష్టంలేక 'నాకోసం ఓ అమ్మాయి వచ్చింది. మాట్లాడుతున్నాను. ఆమె వెళ్ళిపోగానే ఫోన్ చేస్తాను అప్పటివరకూ డిస్టర్బ్ చెయ్యకు.' ఫోన్ పెట్టేశాను నిమిషం తర్వాత నేను చేసిన పొరపాటు అర్థమైంది. ఇప్పుడు విజయ్ గుండె ఆగిపోవడానికి ఎంతైనా ఆస్కారం ఉంది. అతని ఐదేళ్ళ సర్వీస్లో ఇంత పెద్ద షాక్ ఎప్పుడూ తినిఉండడు. పెళ్ళాంతో తప్ప ఇంకో ఆడదానితో మాట్లాడలేని బాస్ హోటల్ గదిలో ఓ అమ్మాయితో ఒంటరిగా ! ఆ అమ్మాయి కోసం ఓ అతిముఖ్యమైన అపాయింట్మెంట్ కాన్సిల్ !

'మీరెవర్నైనా ఎప్పుడైనా గాఢంగా ప్రేమించారా !' ఇది సీత మొదటి ప్రశ్న. ఆ ప్రశ్నలోనే 'నేను ప్రేమించాను సుమా' అని అంతర్లీనమై ఉన్న ఆమె జవాబు. ఆ వయసు అటువంటిది. ప్రేమను మించిన పెద్ద సమస్య వాళ్ళకు ఊహాతీతం.

'ఈ విషయంలో నేను మీ దగ్గరకు రావడం ఎంతవరకూ సమంజసమో నాకు తెలీదు. కానీ నేనున్న పరిస్థితులు నాకు మరో మార్గాన్ని చూపించలేకపోయాయి.'

'సూటిగా మాట్లాడేవాళ్ళంటే నాకు చాలా యిష్టం.' మెల్లగా అన్నాను.

'నాకు డబ్బు కావాలి.'

బలవంతాన నవ్వు ఆపుకున్నాను. ఈ విశాల విశ్వంలో అది అక్కర్లేనిదెవరికి ?

'ఎంత?' అడిగాను.

'ఎంత ఇవ్వగలరు ?'

నా అహం దెబ్బ తిన్నది. నేనీ ప్రపంచంలో దేన్నైనా సహిస్తాను. నన్ను ఇతరులు తక్కువ అంచనా వేయడాన్ని మినహాయించి. ఫోన్ అందుకున్నాను.

'విజయ్ !'

'ఎస్ బాస్' ఆ గొంతులో ఇంతకు ముందు నేనిచ్చిన కరెంట్ తాలూకు ఉధృతం ఇంకా తగ్గలేదు.

'స్విట్జర్లండ్లో మన బాంక్ పొజిషన్ ఏమిటి ప్రస్తుతం ?'

'త్రీ పాయింట్ ఫైవ్ మిలియన్ డాలర్ ఎకౌంట్లో. సిక్స్ హండ్రెడ్ థౌజండ్ స్విస్ ఫ్రాంక్స్' రిసీవర్ ఆమె చెవి దగ్గరగా పెట్టాను.

'లండన్లో?'

'టూ హండ్రెడ్ థౌజండ్ పౌండ్స్. అదిగాక నిన్నటి పాతికవేల ట్రాన్సాక్షన్ కలపాలి. ఇంకా చేరిఉండదులెండి అది.'

'ఓకే. థాంక్స్ ఎ లాట్'

గర్వంగా ఆమెవైపు చూశాను. నేననుకున్న మార్పులేవీ రాలేదామెలో. నిర్లిప్తంగా కూర్చుంది. పాతికేళ్ళ నా అనుభవంలో ఎన్నివేలసార్లో అనుకున్న విషయాన్నే మళ్ళీ మనసులో అనుకున్నాను. 'మిలియన్లు సంపాదించడం పెద్ద కష్టమైన పనేంకాదు, ఒక స్త్రీని సంతృప్తిపరచడంతో సరిపోలిస్తే,' అని.

'మొన్న మొన్నటివరకూ మా జీవితాలు సాఫీగానే సాగుతూ వచ్చాయి. నా ఆపరేటర్ ఉద్యోగం, మావారి సేల్స్మెన్ ఉద్యోగం, మాకు అంతులేని భోగభాగ్యాల్ని ప్రసాదించలేకపోయినా, జీవికకు లోటు చెయ్యలేదు. కానీ ఈ మధ్య ఆయన ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. మొదట్లో అశ్రద్ధ చేశారు. తర్వాత జస్లోక్ హాస్పిటల్లో చూపిస్తే, డాక్టర్లు కిడ్నీ ట్రాన్స్ప్లాంట్ చెయ్యాలన్నారు. ఇప్పటికే బాగా లేటయిపోయిందట.'

ఆమె గొంతు జీరవోయింది.

'నాకీ లోకంలో ఉన్నది ఆయనొక్కరే. తను లేకుండా నేనుండలేను.' పదాలు సామాన్యమైనవే అయినా, వాటిలో నిండిఉన్న క్షోభ, ఆ గుండెకోత నన్ను కదిలించాయి.

'నా అనేవారు మా యిద్దరికీ లేరు. కొద్దిమంది స్నేహితులున్నా, వేలకొద్ది రూపాయలిచ్చి ఆదుకోగలిగినా తాహతు కలవారు కారు. ఇప్పుడు నా ముందు రెండే రెండు మార్గాలు. ఒకటి మిమ్మల్ని యాచించడం. రెండు ఆయన చావును కళ్ళారాచూసి ఇంత బూడిద చెయ్యడం. మొదటి మార్గం

మూసుకుపోతే రెండో మార్గాన నడవడంతప్ప గత్యంతరం లేదు నాకు."

ఆ మనసు లోతుల్లోని అశాంతినీ, ఆవేదనను నా ఆలోచనల్లోకి అనువదించుకుంటే కళ్ళు తడిశాయి. ఆ గుండెలో దాగిఉన్న అగ్నిపర్వతాల పరిణామం అర్థమైనకొద్దీ నాలో లావా స్రవించసాగింది.

ఫోన్ మోగింది, మళ్ళీ.

'మిస్టర్ చక్రవర్తీ. కాల్ కాలింగ్ ఫ్రమ్ స్విట్జర్లాండ్.' ఆపరేటర్ చెప్పింది.

నేను ఫోన్లో మాట్లాడుతున్నంతసేపూ తను జారిపోతున్న ధైర్యాన్ని కూడగట్టుకోవడం గమనిస్తూనే ఉన్నాను. అయితే, నాకు వచ్చిన వార్త ఏమంత సంతోషకరమైనది కాదు.

నాకు రావలసిన ఒక చాలా పెద్ద ఆర్డర్‌ను ఇంకో రైవల్ కంపెనీ తన్నుకుపోయింది. అప్పటికే దానిమీద నేను రెండు లక్షల డాలర్లదాకా ఖర్చు పెట్టేశాను. డబ్బుకన్నా, నా పరువు ప్రతిష్ఠలు దానిమీద ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. ఏం చెయ్యాలో తోచక, జుట్టు పీక్కున్నాను. బట్టతల మీద అప్పటివరకూ ఎంతోవిశ్వాసంతో ఉండిపోయిన పది పదిహేను వెండితీగల్లోంచి రెండు ఊడి చేతిలోకి వచ్చాయి. ఆలోచనలు మాత్రం రాలేదు.

'ఏమయింది' అందామె నాలోని మార్పుల్ని గమనిస్తూ.

చెప్పాను.

'మీ బిజినెస్‌లో ఇలాంటివి సహజమనుకుంటాను.'

'నా విషయంలో మాత్రం కాదు. చక్రవర్తి నా పేరు. గెలుపు నా ఊపిరి. ఓటమికి నా జీవితంలో చోటు లేదు.' అది ఆత్మవిశ్వాసమో, అహంకారమో నాకు తెలీదుగానీ పుట్టినప్పటినుంచీ నాతోనే ఉంది అది.

'ఇది ఓటమి కాదా !'



"శత్రువుది పై చేయి అయినంత మాత్రాన అది నా ఓటమి అనిపించుకోదు. గెలవడానికి ఇంకా ఎన్నో మార్గాలున్నాయి నాకు. ఇది కేవలం చిన్న దెబ్బ మాత్రమే."

ఫోన్ ఇంకోసారి గొణిగింది. నాకు తెలుసు, నా భార్య దగ్గర్నుంచి అని. లేకపోతే ఫోన్ అలా మోగదు. రిసీవర్ ఎత్తాను. నా అంచనాలు ఎప్పుడూ తప్పవు.

"మీ రూంలో ఎవరా అమ్మాయి ?" డైరెక్టుగా అడిగేసింది. క్షణంసేపు గొంతు పెగల్లేదు నాకు.

'అబ్బే, ఏంలేదు...అహ...... అవునూ...నీకెలా తెలుసూ !'

'ఆ గాజుల చప్పుడూ, మల్లెపూల వాసనా అన్నీ ఇక్కడికీ చేరుతూనే ఉన్నాయి.'

'కొయ్యకు ఆ అమ్మాయికి గాజులు లేవు. మల్లెపూలు పెట్టుకోలేదు.'

'మొత్తానికి అమ్మాయంటూ ఉన్నదన్నమాట.' స్టేల్‌మేట్‌లో పడిపోయాను. ఈ చక్రవర్తికి షా చెప్పడం ఆవిడకొక్కదానికే చేతనౌను. లాయర్ మరి.

'అసలు నువ్వెలా పసిగట్టావ్ ?'

'ఇప్పుడే విజయ్‌కి ఫోన్ చేశాను.'

అమ్మ ! రాస్కెల్ ! ఎంత పని చేశాడు ! ఈ రకంగా ఎదురు దెబ్బ తీశాడన్నమాట. ఎంత పెద్ద రహస్యమైనా తనలోనే చంపేసుకుంటాడు ఎప్పుడూ. కానీ మా ఆవిడ గొంతు వినబడితే చాలు. సంజీవి మంత్రం వల్లించినట్లు అన్నీ బ్రతికిపోతాయి. లాయర్ ముందు అన్నీ నిజాలే చెప్పాలన్నా లోకనీతికి విరుద్ధంగా ఎప్పుడూ నడవలేదతను. అదే తనలోని పెద్ద వీక్‌నెస్. ఇప్పుడిక నేను అబద్ధం ఎలా చెప్పను ?

'అవును. ఈ అమ్మాయి ఏదో పనిమీద వచ్చింది. ఇంతకీ నువ్వెలా ఉన్నావ్ ?'

'నాకేం నిక్షేపంలా ఉన్నాను. వందలూ, వేల మైళ్ళ దూరంలోఉన్నా, రోజుకు రెండుసార్లు ఫోన్‌చేసే మొగుడుండగా నాకేం లోటు ? ఇంతకీ ఎవరా అమ్మాయ్ !'

'ఎవరో టెలిఫోన్ ఆపరేటర్లే. పిల్లలేం చేస్తున్నారు ?'

'కాలేజీ నుంచి ఇంకా రాలేదు... టెలిఫోన్ ఆపరేటరా !'

'నిన్న వెంకటేశ్వర్రావ్ డబ్బు తెచ్చాడా !'

"తెచ్చాడుగానీ, ఆపరేటరా !"

'అవునంటుంటే...'నాకా పరిస్థితి చాలా ఇబ్బందిగా వుంది. ఆవిడ

మాటల్లో పొడిచేస్తోంది అవతల, ఇక్కడ ఈ అమ్మాయి చూపుల్తో గుచ్చేస్తోంది.

'ఏం పనిమీద వచ్చిందీ......" దీర్ఘంతీసింది మా లాయర్.

'ఇంకా తెలీలేదు. తెలిసిన వెంటనే నేనే ఫోన్ చేస్తాను. సరేనా !'

'అయినా మీరు ఒంటరిగా ఆ అమ్మాయితో హోటల్ రూంలో ఉండటం ఏమిటి? బయటెక్కడైనా మాట్లాడొచ్చుగా. చెట్టంత కొడుకుల్ని ఉంచుకొని ఈ వయసులో ఇవేం విపరీత బుద్ధులూ మీకు !'

'చూడు శాంతా ! ఈ వయసులో నాకు లేని ఆలోచనలు బలవంతాన ఎక్కిస్తున్నావు. ఇన్నాళ్ళు కాపురం చేశావ్. ఆ మాత్రం తెలీదా, నేను శ్రీరామచంద్రుణ్ణో, కేవలం శ్రీరంగ నీతులు వల్లించేవాణ్ణో ! అయినా ఈ అమ్మాయికి మన భాష అర్థంకాదు. కాబట్టి సరిపోయింది......సర్లే ఇక నువు పెట్టేయ్. నేను తర్వాత మళ్ళీ ఫోన్ చేస్తాను.'

'అంతే...అంతే...ఆ ఆపరేటర్లే నయం నాకన్నా. నాక్కూడా అటు వంటి ఉద్యోగం చూడండి. అలా అయినా మీతో కాస్త ఎక్కువసేపు మాట్లాడే భాగ్యమన్నా కలుగుతుందేమో! ఇంతకీ ఇంటికెప్పుడు విజయంచేస్తు న్నారు ? అడ్రస్ గుర్తుందా ! మళ్ళీ ఇవ్వనా పోనీ !'

'రేపొచ్చేస్తున్నాను.'

'గోవా వెళ్తున్నానన్నారు !'

'అయితే ఎల్లుండి'

'ఎల్లుండి ఢిల్లీలో మీ అమెరికా ఏజంట్స్‌తో కాన్ఫరెన్స్ ఉందిగా.'

'అయితే...'

అంతే. శాంతి టక్కున ఫోన్ పెట్టేసింది ఆమె దేన్నైనా సహిస్తుంది గానీ అబద్ధాన్ని సహించలేదు. నేను, నిజానికీ, అబద్ధానికీ మధ్య తేడాను ఇప్పటికీ కనిపెట్టలేను, ముఖ్యంగా ఆవిడతో మాట్లాడేప్పుడు. నేను చెప్పే ప్రతి మాటా నిజం అనే అనుకుంటాను కానీ అది అబద్ధమైపోతుంది ప్రతిసారీ ఆవిడ విషయంలో.

'ఎవరూ ! మీ శ్రీమతిగారా ?' అడిగింది సీత.

అవునన్నాను.

'ఈ వయసులో ఇంకా మీకెందుకీ తాపత్రయం. సంపాదించింది చాలదా ! హాయిగా ఇంట్లో భార్యా పిల్లల్తో కూర్చోక !'

శాంతి కూడా ఇదే భావాన్ని లక్ష సార్లు, కోటి విధానాల్లో వెల్లడించింది. వ్యాపారం, వ్యసనం రెండూ ఒకటే. దేన్నీ వదల్లేం, భార్యలకోసమైనా సరే.

'కేవలం నా సంసారానికైతే సరిపోతుంది, నేను సంపాదించేది. కానీ నేను ఇది మానేస్తే నీలాంటి ఎంతో మందికి ఎలా సహాయపడగలను ?"

ఇది మాత్రం నిజం. నేను వ్యాపారం కేవలం ఇతరులకు సహాయపడటానికి చేయకపోయినా, నేను సాయంచేసిన వాళ్ళు చాలామందే ఉన్నారు.

"ఇతరులకు ఉపయోగపడటానికీ బతికే బ్రతుక్కు అర్థంలేదు. అంత కన్నా వ్యర్థం ఇంకోటి లేదు పరాయి వాళ్ళ పరమోద్ధరణ ఆలోచిఃచేవాడు, అయినవాళ్ళకు ఆకుల్లోనే వడ్డిస్తాడు ఎప్పుడూ ఒక స్త్రీగా మీ భార్యను నేనర్థం చేసుకోగలను. మీరు సంపాదిస్తున్న దాంతో సరిపోలిస్తే మీరు కోల్పోతున్నది చాలా ఎక్కువ.'

సలహాలు, నేను ద్వేషించేవాటిలో కొన్ని. ఆ అమ్మాయిమీద నాకు ఏర్పడిన సానుభూతి, ఆప్యాయత, అనుబంధాల లాంటి భావాలు సజీవంగా ఉండగానే ఆమెను సాగనంపడం మంచి దనిపించింది.

'ఎనీహౌ, అది నా జీవన విధానం దాన్నింతవరకూ ఎవరూ మార్చలేక పోయారు. మార్చుకోవడం నావల్ల కాదు.' చెక్కు బుక్కు. తీసి సంతకం చేసిన బ్లాంక్ చెక్ ఆమె కిచ్చాను.

'వ్యాపారస్థులు ప్రతిఫలం ఆశించ కుండా ఏ పనీ చెయ్యరంటారు. మీరు నానుండి ఏం ఆశిస్తున్నారు ?'

మళ్ళీ ఇంకోసారి ఆ అమ్మాయి నా అహంమీద తెలిసో, తెలియకో దెబ్బ కొట్టింది. అయినా కోపం రావడం లేదు. జాలి వేస్తోంది తన అమాయ కత్వం మీద. సూటిగా ఆమె కళ్ళ లోకి చూశాను. తల దించుకుంది.

'ఏమివ్వగలనని నీనుండి నేనాశిం చాలి ? వయసు మినహా నీ దగ్గరేం లేదు. ఒక చేత్తో డబ్బిచ్చి మరోచేత్తో ఆ వ్యక్తి మానాభిమానాల్ని దోచుకునే రాక్షస వ్యాపారం నేను చెయ్యలేను. మాకు సరుకుల విలువలే కాదు, మానవత్వపు విలువలు కూడా తెలుసు. నీ కీరోజున నేనీ రకంగా ఉపయోగ పడుతున్నానంటే అది నా ఆత్మ సంతృప్తికోసం. ఓ మంచి మనిషికి నేనూ చేయూత నిస్తున్నానన్న మన శ్శాంతి కోసం. మళ్ళీ నీ భర్తతో కళ కళ లాడుతూ నాకు కనిపించు. అదే నువు నా కిచ్చే ప్రతిఫలం.'

నా పాదాలు తాకడానికి వంగబోయిం దామె. మధ్యలోనే వారించాను.

'నీ కళ్ళల్లో మెరిసే ఆ వెలలేని ముత్యాలే నాకు కోటి కృతజ్ఞతల్ని చెబుతున్నాయి,' అన్నాను.

ఇక నిగ్రహించుకోలేక, నా భుజం మీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడవ సాగిందామె. ఆమె తల నిమురుతూ ఉండిపోయాను కాసేపటివరకూ.

'ఊరుకోక ఎందుకంత బాధ పడతావ్ ! తప్పకుండా నయమౌతుం దతనికి. మళ్ళీ మీరిద్దరూ బ్రతుకులోని

మాధుర్యాన్ని తనివితీరా చవిచూస్తారు. ఇక నా డబ్బు సంగతంటావా ! ఒక కాపురం పచ్చనవ్వడాన్ని మించిన గొప్ప ప్రయోజనాన్ని, సార్థకతను దాన్నుండి నేనాశించడంలేదు.

కళ్ళు తుడుచుకుందామె. మాటలు రాని దానిలా మౌనంతోనే అనేక కృతజ్ఞతలు చెబుతూ వెళ్ళిపోయింది. నేనూ మనిషినే అని నిరూపించుకునే ఒక అమూల్యమైన అవకాశాన్ని నాకిచ్చి, లిఫ్ట్ వరకూ ఆమెను సాగనంపి తిరిగి వస్తుంటే ఎప్పుడో మర్చిపోయిన నా కళ్ళు మళ్ళీ ఈవేళ చెమర్చాయి. నా మనస్తత్వం అతి సున్నితం. ఏ చిన్న తాకిడినీ తట్టుకోలేదు. అందుకే ఈ బ్రతుకులో నాకు మనశ్శాంతి బద్ధ శత్రువు.

కాలం నా వయసుకో సంవత్సరాన్నీ బ్యాంక్ అకౌంట్‌కో నాలుగు లకారాల్నీ చేర్చి నిశ్శబ్దంగా అనంతంలోకి జారిపోయింది. ఆ సంవత్సరమంతా నేను ఎక్కువగా మిడిల్ ఈస్ట్, కాంటినెంట్‌లలో గడపడంలో ఇండియా రావడం పడలేదు.

బొంబే రాగానే నాకు తెలిసిన మరో ఆపరేటర్ ఫోన్‌చేసి చెప్పింది. సీత నాకు వ్రాసిన ఓ ఉత్తరం తనతో ఉందనీ, సాయంత్రం తీసుకొస్తున్నాననీ ఆ అమ్మాయి బిజీగా ఉండటం వల్ల వివరాలడగటం కుదరలేదు. బహుశా ట్రాన్స్‌ఫర్ ఏమైనా వచ్చిందేమో సీతకి, లేకపోతే ఉత్తరం వ్రాయవలసిన అవసరమేమిటి ? తనే స్వయంగా వచ్చి కలవవచ్చుగా, అనుకున్నాను. ఆ సాయంత్రం ఆ ఉత్తరం చదువుతూంటే క్రమంగా నా మెదడు మొద్దుబారిపోతున్నట్టు, నేను మళ్ళీ నా ప్రగతినుండి వెనక్కి, ఎంతో వెనక్కి, ప్రాకృతిక పైశాచిక ప్రవృత్తిలోకి వెళ్ళిపోతున్నట్లనిపించింది. మొదట నాకా ఉత్తరం ఏ మాత్రం అర్థం కాలేదు. అందులో ఉన్న వాక్యాలూ, దాన్ని తెచ్చిన అమ్మాయి చెప్పిన మాటలూ, సమన్వయపరుచుకుంటే జరిగిన దారుణం కళ్ళముందు కదిలింది.

సీత ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్తకు పూర్తి ఆరోగ్యం చేకూరింది. ఆపరేషన్ అయిన తర్వాత అతను అనేకసార్లు అడిగాడు, ఆమెను డబ్బు ఎక్కణ్ణించి తెచ్చావని. ఒళ్ళు అమ్ముకోని ఆడది పైసా కూడా ఇతరత్రా సంపాదించలేదని గాఢంగా నమ్మే, ఒక చెడిపోయిన తరగతికి ప్రాతినిధ్యం వహించే అతన్ని, సీత నిష్కల్మషత నమ్మించలేకపోయింది. నిజం చెప్పి చెప్పి విసుగెత్తిపోయి, అతను పెట్టిన చిత్రహింసను ఎన్నో రోజులు భరించి, సహనం ఇంకిపోగా, ఆత్మగౌరవంతో జీవితంలో అన్నీ తుడిచి పెట్టుకుపోగా, సుఖశాంతులు ఇగిరిపోయి, ఆరాధించే దేవుడు వరానికి బదులు ఘోరశాపాన్ని ప్రసాదిస్తే, ఈ జీవితమనే శూన్యంలో ఏం చూసుకుని బ్రతకాలో అర్థంకాక, చావులో విముక్తి వెదుక్కుంది ఆ అభాగ్యురాలు. భార్య శవాన్ని చూడ్డానికి రాలేదతను. ఆయన లేకుండా నేను బ్రతకలేను అని నాతో చెప్పిన సీత, అతని ఉనికిని భరించలేక ఉరిపోసుకుంది. ఆ ఉత్తరం తెచ్చిన అమ్మాయిని అడిగాను 'అతనెక్కడుంటున్నాడిప్పుడు ?' ఆమె అడ్రసిచ్చి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి హోటల్ బయటికివచ్చి టాక్సీలో కూర్చుని ఆ అడ్రస్ డ్రైవర్‌కిచ్చాను. మెరైన్‌డ్రైవ్‌నుండి వీస్తున్న గాలి నాకేమాత్రం ఉపశాంతి నివ్వలేకపోతోంది. నా మనస్తత్వం నాకే అనూహ్యం. ఎందరో సైకియాట్రిస్ట్‌లను సంప్రదించాను. క్షణికమైన ఆలోచనతో ఆవేశపడి నిర్ణయాలు తీసుకోవద్దని అనేకమంది హెచ్చరించారు. కానీ అది నా చేతకావడంలేదు. నేను చేసే ప్రతి పనీ సమర్ధనీయంకాదని నాకు తెలుసు. అయినా నేను నిగ్రహించుకోలేను.

నా డబ్బు అన్యాయాలూ, అక్రమాల ద్వారా సంపాదించింది కాదు. అది నా చెమటలో నుండి పుట్టింది. నా రక్తంతో పెరిగింది. దాని పవిత్రత దేనికీ రాదు. ఎవరూ దానికి విలువ కట్టలేరు. అమృతం అవుతుందనుకుని నేను పోసిన ప్రాణం విషంగా మారిపోతే సహించేంత పెద్దగుండె నాకు లేదు. ఒక ఆడదాని కన్నీళ్ళు తుడవడానికి చేసిన ప్రయత్నం ఆ స్త్రీ ప్రాణాల్నే బలిగొనడాన్ని మినహాయించి వేరే నరకం నాకు లేదు.

చిన్నప్పటినుంచీ నేను మొండివాణ్ణనీ తొందర ఎక్కువనీ, ముందూ వెనకా ఆలోచించననీ ఆవేశంలో అనేకమైన నిర్ణయాలు తీసుకుంటాననీ అందరూ అనేవారు. ఒకసారి నేను మా నీళ్ళకుళాయి దగ్గర ఆడుకుంటుండగా, ఓ గండుచీమ నీళ్ళలో పడింది. పెద్ద మానవతా దృక్పథంతో దాన్ని చేతిమీద కెక్కించుకొని బయటకు తీసుకొచ్చాను. అది ఒక్కసారి ఒళ్ళు విదిలించుకుని నా వేలిని గట్టిగా కుట్టి కిందకు దూకింది. కాలితో బలంగా దాన్ని నేలరాచాను. అప్పటికీ ఇప్పటికీ నా అభిప్రాయాల్లో పెద్ద మార్పేమీ రాలేదు.

జేబు తడుముకున్నాను. రివాల్వర్ చల్లగా తగిలింది.

---